**కథ**

**ఎప్పటిలాగే ఉత్తరం ఎక్కడినుంచి వచ్చిందో అర్థం కాకుండా తపాలా ముద్ర ఒకటి వుంది. రకరకాల కోణాల్లో తిప్పి కళ్ళు చికిలించుకుని చూస్తే రెండు, మూడు అక్షరాలు గుర్తుపట్టగలిగాను. ఊహూ పట్టుబడలేదు. అయినా ఈ రోజుల్లో ఉత్తరం రావడమే అదృష్టం. ఎస్.ఎం.ఎస్‌లూ, ఇ-మెయిల్స్‌తో విసిగిపోయాను.**

# కొత్త బంగారు లోకం

**- అనిసెట్టి శ్రీధర్**

మీరు ఈ లోకంలో సంతోషంగా ఉన్నారా? లేరు కదూ? ఎలా ఉంటారు? మీరు కేవలం మీకోసం, మీ కుటుంబం కోసం మాత్రమే ఆలోచించరు కనుక. మీరు ప్రజల సమస్యల గురించి చింతాక్రాంతులై ఉంటారు. ఏమీ చెయ్యలేని నిస్సహాయత మిమ్మల్ని ఆవరించి ఉంటుంది. ఏం చెయ్యాలి, ఎక్కడ మొదలుపెట్టాలి అనే ఆలోచనలతోనే సమయం గడిచిపోతుంటుంది. నిజానికి మీలో ఒక కొత్త బంగారు లోకాన్ని సృష్టించగల శక్తి నిద్రాణంగా ఉంది. మీరు మార్పుకోసం ప్రయత్నించకుండా, కనీసం మార్పు గురించి ఆలోచించే సమయం కూడా ఇవ్వకుండా విపణి శక్తులు మిమ్మల్ని చక్రవ్యూహంలో బంధించి ఉంచుతాయి. అభివృద్ధి ముఖ్యం, సాధించే తీరు కాదు అని ఘోషిస్తుంటాయి. వ్యాపారాల్లో, రాజకీయాల్లో విలువలు మృగ్యం అనే రోజుల నుండి విలువలు లేకపోవడమే వ్యాపారం, రాజకీయం అనే రోజులు వచ్చాయి. మేమూ మీలాంటివారమే. అయితే శృంఖలాలను ఛేదించి ప్రపంచంలో పెరిగిపోయిన హింస, అవినీతి, మోసం, స్వార్థం, కుటిలత్వం- వీటిని సహించలేని, సర్దుకుపోలేని వారి కోసం ఒక కొత్తబంగారు లోకాన్ని ఆవిష్కరించాం. మీ నడవడికను, ఆలోచనా ధోరణులను గమనించాం. మాకు ఆమోద యోగ్యంగా ఉండడంతో మిమ్మల్ని కొత్త బంగారులోకంలోకి ఆహ్వానిస్తున్నాము. కానీ ఈ ఆహ్వానం మీ ఒక్కరికే. మీ ఒక్కరికే కొత్త బంగారులోకంలోకి ప్రవేశం. బంధుమిత్ర సపరివార సమేతంగా కాదు. మీరు ఏ సమయంలో, ఎక్కడకు రావాలో త్వరలోనే తెలియచేస్తాము. సిద్ధంగా ఉండండి''

తిప్పి చూడండి.

తిప్పి చూసాను. వెనక ఏమీ లేదు. ఊరూ, పేరూ లేదే అనుకుంటూ ముందుకు తిప్పాను. షాక్ ఆఫ్‌మై లైఫ్. తెల్లకాగితం తప్ప అక్షరాలు మాయం!

అవును కదూ. ఈ ఉత్తరం జాగ్రత్తగా చదవండి. మీకు మరోసారి చదివే అవకాశం ఉండదు అని ఉత్తరం మొదట్లో రాసారు. అసలు వీళ్ళెవరు? నా మనసుని ఇలా స్కాన్ చేసి పడేశారు. నన్ను బాగా ఎరిగిన వాళ్ళా? కొత్త బంగారులోకం అనే పేరుతో ఫోన్ నెంబర్ కానీ, ఏదైనా ట్రస్ట్ రిజిష్టర్ అయి ఉందాని, వైబ్‌సైట్ ఉందా అని వెతికాను. ఎవడో ఆకతాయి చేసి ఉంటాడనుకోవడానికి వీల్లేదు. కాగితంలో అక్షరాలు మాయమవడమేమిటి?

ఈ ఉత్తరం వెయ్యి ప్రతులు చేయించి పంచకపోతే నువ్వు నాశనమైపోతావని రాయలేదు.

''మీ ఆరోగ్య రేఖ చిన్నదిగా ఉన్నదా? ఋణ రేఖ లేదా లేక తరిగినదా? ఆటంకాలు ఎదురౌతున్నాయా? సమస్యల సత్వర పరిష్కారం కొరకు నేడే సంప్రదించండి''

''పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యాకే డబ్బు చెల్లించండి''

''సహ నిర్మాతలు కావలెను'' లాంటి ప్రకటన కాదు.

కంప్యూటర్ కట్టేసాను. సెల్ ఆఫ్ చేశాను. కిటికీలోంచి బయటకు చూశాను. పన్నెండు దాటింది. రాత్రో పగలో తేడా తెలియకుండా ఆకాశంలో పోటీపడుతూ విద్యుద్దీపాలు. ఆకాశ హర్మ్యాల బారులు. రోడ్డు మీద చీమల వరుసల్లా కార్లు. లంకంత అపార్ట్‌మెంట్స్. కంపెనీ లీజ్. ఒక్కడ్నే, చదువులకని భార్యా పిల్లలు మరో ఊళ్ళో.

ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఒకటేమిటీ అన్ని వ్యాపార రంగాల్లోకి చొచ్చుకుపోయిన సంస్థ. ఒక ఊరు కాదు, ఒక దేశం కాదు. ఒకే సమయంలో రెండు చోట్ల ఉండవలసిన పరిస్థితులు. నిత్యం ఉరుకులు, పరుగులు.

ఛైర్మన్‌కి మూడే మాటలు తెలుసు.

టార్గెట్, టార్గెట్, టార్గెట్.

నిజమే. కంపెనీ ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించమని మా ఛైర్మన్ పెట్టే కేకలు ఎవరెస్ట్ శిఖరం ఎక్కినా వినపడుతూనే వుంటాయి. ప్రజల జీవన స్థాయితో సంబంధం, అనుబంధం అక్కర్లేదు. వాళ్ళ జీవనశైలిని మార్చేయాలి. వాళ్ళను మార్కెట్ వైపు పరుగెత్తించాలి. మరింత డబ్బు, మరింత భూమి, మరిన్ని వస్తువులు. ఇదే ప్రతివాడి తారకమంత్రం.

విసుగెత్తిపోయాను. ఇలా కూర్చుని ఆలోచించి ఎన్ని రోజులు, ఊహు కాదు ఎన్ని నెలలైంది. ఎ.సి. కారులో వెళుతున్నపుడు సిగ్నల్స్ వద్ద ఎర్రటి ఎండలో చంటిపిల్లని చంకన వేసుకుని పిన్నీసులు, మొలతాళ్ళు అమ్ముకునే బంజారా మహిళ. రహదారి పక్కన, మురికి కాలువల ఒడ్డున డేరాలు కట్టుకుని బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికై పట్నానికి వలస వచ్చిన కూలీలు. టీ పాకల్లో, మోటారు గరాజుల్లో, పరిశ్రమల్లో బండబారి పోతున్న చిన్ని చేతులు. తామే ఎద్దులై దున్నుతున్న బక్క రైతులు. ఎవరు రాశారు వీళ్ళ తలరాతల్ని. వాటినెవరు మార్చాలి. నేను చేస్తున్నదేమిటి? చెయ్యాల్సిందేమిటి? నా సెక్రటరీ అనూ జైస్వాల్ నా మీద జాలి పడుతుంటుంది.

''ఏమిటి బాస్ జీవితాన్ని అనుభవించకుండా ఈ పిచ్చి ఆలోచనలు. ఏటికి ఎదురీదలేనప్పుడు ఏటి వాలుకు కొట్టుకుపోవడాన్ని ఎంజాయ్ చెయ్యొచ్చు కదా. రేస్ ఈజ్ ఇనె విటబుల్ బాస్, ఇనె విటబుల్'' అని పగలబడి నవ్వుతుంది. ఎక్కడికైనా దూరంగా పారిపోవలనిపిస్తుంది. ఈ పరిస్థితుల నుంచి తప్పించుకుని ఎంత దూరం,



ఎక్కడికి వెళ్ళాలి, ఏం చెయ్యాలి? నాకు ఊపిరాడనివ్వని ఈ వైరుధ్యాలకు కొత్త బంగారులోకమే పరిష్కారమేమో.


ఇంతకూ కొత్త బంగారులోకమనేది ఒక సంస్థా లేక ఒక ప్రదేశమా? కొత్త బంగారులోకం ఎలా వుంటుంది? ఎన్ని రోజులుండాలి?నచ్చకపోతే వెనక్కు రానిస్తారా? భార్యా, పిల్లల్ని ఎలా కాంటాక్ట్‌చేయాలి? సెల్ పనిచేస్తుందా? కొత్త బంగారులోకం నుండి మళ్ళీ ఈ లోకంలోకి రాకపోకలుంటాయా? నిషిద్ధమా? నా ప్రియ మిత్రుడు శంకరం గుర్తుకువచ్చాడు కానీ ఇది ఎవరితోనో చర్చించి తీసుకోవలసిన నిర్ణయం కాదు. పైగా దీనికి వేరే ఆధారం ఏమీలేదు. తెల్ల కాగితం తప్ప. అయినావాళ్ళు నాపై ఉంచిన నమ్మకాని వమ్ము చేయకూడదు కదా.

అయినా ఇదేమైనా ఉద్యోగమా. ఆసంస్థ గురించి అన్నీ తెలుసుకుని ఒప్పందం కుదుర్చుకోవడం కుదరదు కదా! ఇందులో ఇప్పటికే ఎంతమంది ఉన్నారో? నేను కొన్ని రోజులు 'మోక్షం' అనే ఆధ్యాత్మిక సంస్థలో ఉన్నాను. అక్కడ గురువుగారే భగవంతుడు. ఆయన నామస్మరణ, ఆయన చిత్తరువులు, బాడ్జీలు, భజనలు. అదొక మత్తు. భరించలేక వచ్చేసాను. కొత్త బంగారులోకం కూడా అటువంటి సంస్థేనా? బ్యాడ్జీలు, ఫోటోలు, పుస్తకాలు కొనాలా? అయితే ఇలా రహస్యంగా పని చేయాల్సిన అవసరమేముంది. రహస్యంగా? ఇది అన్నలు(మావోయిస్టులు) తమ సభ్యుల్ని పెంచుకునే ఎత్తుగడ కాదు కదా? ఏమైనా నా జీవితంలో ఇదొక సువర్ణ అవకాశమో, మరొక వైఫల్యమో తేలాలి. ఈ మనుషుల్ని వెంటాడే, డబ్బుల్ని కొలిచే జీవితం నుండి విముక్తుణ్ణి కావాలి. ఈ వేట ఇక ఆపెయ్యాలి. అవునూ నేను కనిపించకుండా పోతే పరిణామాలు ఎలా వుంటాయి.

ఫలానా కంపెనీలో ఉన్నతాధికారి కనిపించకుండా పోయాడని దినపత్రికల్లో తప్పకుండా రాస్తారు. ఎవరైనా డబ్బు కోసం కిడ్నాప్ చేశారా లేక శత్రువులెవరైనా వున్నారా అని కథనాలు వెలువడతాయి. టీవీ ఛానెల్స్ నా భార్యను ఇంటర్వ్యూ చేస్తాయి. నా సెల్స్ మూడూ అదే పనిగా మోగుతూనే వుంటాయి. కంపెనీలో నా పదవి కోసం కాచుక్కూర్చున్న వాళ్ళు లోలోపల సంతోషించవచ్చు. ఇలా కొన్ని రోజులు. తర్వాత మామూలే. భూమి గుండ్రంగా తిరగడం మానెయ్యదు కదా!

* * *

కొత్త బంగారులోకం లోకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాక ప్రయాణ సన్నాహాలు మొదలెట్టాను. కొత్త బంగారంలో గుళ్ళూ, గోపురాలూ ఉంటాయో, లేవోనని నా ఇష్టదైవం పటం ఒకటి పెట్టుకున్నాను. హోమియో మందులు ఏమేం తీసుకెళ్ళాలో. నేత్రం సల్ఫ తప్పనిసరి. జలుబు చేస్తే ఇబ్బందిగా వుంటుంది. ఒక వేళ అన్నలు లాక్కుపోతే మందూ, మాకూ లేక ఇబ్బందే. మరికొన్ని మందులు కూడా సర్దు కున్నాను. అన్నిటికన్నా పెద్ద ప్రశ్న ఒకటి నా మనసును తొలిచేస్తుంది. నా భార్యా పిల్లలకు



చెప్పి వెళ్ళాలా? చెబితే వెళ్ళనివ్వరు. గౌతముడు యశోధరకు చెప్పకుండానే సత్యాన్వేషణకై వెళ్ళి పోయాడంటారు. దీన్ని పేరడీ చేసి పిల్లల్ని ఉద్ధరించలేనివాడు లోకాన్ని ఏం ఉద్ధరిస్తాడు అని రచయితలు కథలు రాశారు. నా ఊహ ఏమిటంటే గౌతముడు యశోధరతో చర్చించి ఆమె అంగీకారం తీసుకునే లోక కల్యాణం కోసం బయలుదేరాడు.

* * *

నన్ను మళ్ళీ ఎలా సంప్రదిస్తారు? ఫోన్ చేస్తే వాళ్ళ నంబర్ తెలిసిపోతుంది కదా. చదవగానే మాయమైపోయేలా ఉత్తరం పంపుతారా? అది ఇంకెవరికైనా చూపించే ప్రమాదం ఉంది. అలా చెయ్యపోవచ్చు. ఆలోచనల్లో ఉండగానే నా సెల్ మోగింది. నంబర్ డిస్ప్లే లేదు! ఎప్పుడు ఎక్కడ కలుసుకోవాలో చెప్పారు.

* * *

ఉదయాన్నే ఐదు గంటలకల్లా తయారయి కారులో బయలుదేరాను. ఊరెళ్ళి వారం రోజులకి వస్తానని వాచ్‌మెన్‌కి చెప్పాను. శీతాకాలం వలన అంతా చీకటిగా ఉంది. ఫోన్‌లో చెప్పిన ప్రకారం జాతీయ రహదారి మీద ఒక తెల్లటికారు ఆగి వుంది. కొత్త మోడల్ అనుకుంటా ఇంతకు ముందు చూడలేదు. నా కారుని రహదారికి వీలైనంత పక్కగా నిలిపాను. కారు ఇదేనా అని సందేహ పడుతుండగా కారు వెనుక అద్దం మీ 'కొత్త బంగారులోకానికి స్వాగతం' అన్న అక్షరాలు మెరిసి మాయమయ్యాయి. కారులో కూర్చున్న వ్యక్తిని చూసి మరింత విభ్రమకు గురయ్యాను. సుమారు ఇరవై యేళ్ళ వయసు అమ్మాయి. ఇదంతా నాబోటి నడి వయస్కులు, ముసలి వాళ్ళు చేస్తున్నది అనుకున్నాను.

''నమస్తే నా పేరు అఖిల'' చేతులు జోడించి చిరునవ్వుతో పరిచయం చేసుకుంది.

''ఈ కళ్ళజోడు పెట్టుకోండి. ఇయర్ ఫోన్స్ పెట్టుకుని సంగీతం వినండి'' కారు కదులుతుండగా చెప్పింది.

మాటలు మంత్రంలా పనిచేశాయి. ఇయర్ ఫోన్స్ పెట్టుకున్నాను.

ఆశ్చర్యం!

ఓ త్రయంబకం యజా మహే సుగంధిం పుష్టి వర్ధనం

ఉర్వారుక మివబంధనాం మృత్యోర్ముక్షీయ మామృతాత్.

మృత్యుంజయ మంత్రం.

ప్రయాణాలు చేస్తున్నపుడు ఈ మంత్రం జపించడమో, వినడమో చేస్తాను. వీళ్ళకెలా తెలుసు? కారు వేగం పెరిగినట్టయి స్పీడో మీటర్ వంక చూశాను. వంద దాటుతోంది. నా గుండె గుభేల్‌మనిపించిన విషయమేమిటంటే స్పీడో మీటర్‌లో సంఖ్యలు వెయ్యి వరకు ఉన్నాయి.

నల్ల కళ్ళజోడు పెట్టుకున్నాను. అంతా చీకటి. కళ్ళకు గంతలు కట్టే బదులు ఈ ఏర్పాటన్నమాట.

మృత్యుంజయ మంత్రం వినిపిస్తూనే ఉంది. కారు వేగం వెయ్యి దాటే వుంటుంది.

* * *

అదొక ప్రకృతి చిత్రం. ఎటు చూసిన పచ్చదనమే. చెట్టూ, చేమ. మనిషి స్వార్థం ఇంకా దూరని చిట్టడివి. చతురస్రాకారంలో వృక్షాలు కొలువుదీరి ఉండగా నేలపై ఆకుపచ్చని తివాచీ పరిచినట్లు పచ్చికతో చిన్న మైదానం. సుమారు నలభై మంది స్త్రీ పురుషులు నాబోటి వాళ్ళే అనుకుంటా గుంపులుగా నిలబడి ఉన్నారు. అంతవరకూ నా పక్కనే ఉన్న అఖిల కనిపించలేదు. నేను వాళ్ళతో కనిపించలేదు.

ఇంతలో అఖిలతో కలిపి ఏడుగురు స్త్రీ పురుషులు తెల్లని దుస్తుల్లో అక్కడ ప్రత్యక్ష మయ్యారు. వాళ్ళు మా వద్దకు నడుచుకుంటూ వచ్చారు. ఆ నడవడికలో జ్ఞానినో, నాయకుడినో, గురువునో దర్పం లేదు. హుందాతనం, అణకువ ఉంది.

ఏడుగురు సప్త ఋషుల్లా. అందరూ ఒకే తానులో గుడ్డతో బట్టలు కుట్టించుకున్నట్టున్నారు. నేను వెళ్ళిన మోక్షం అనే ఆధ్యాత్మిక సంస్థలో కూడా ఒకే రకం దుస్తులు. స్థాయిని బట్టి గుడ్డ ఖరీదు మారింది. అందరూ కింద కూర్చుంటూ మమ్మల్నీ కూర్చోమన్నారు. వాళ్ళ ఎదురుగా కూర్చున్నాము. మోక్షంలో అందర్నీ కింద కూర్చోబెట్టి మధ్యలో ఖరీదైన కుర్చీలో గురువుగారు.

ఒక ఋషి గొంతు సవరించుకుని...

''మిత్రులారా. మొత్తం యాభై మందికి ఆహ్వానాలు పంపాము'' మరి నలభై రెండు మందే వచ్చారు.

''మిగిలిన ఎనిమిది మందిలో ముగ్గురు తమ సన్నిహితులతో చర్చించారు. ఇద్దరు తమ కుటుంబ సభ్యుల్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. మిగిలిన ముగ్గురికీ భయమో, అయిష్టమో, అపనమ్మకమో తెలియదు'' లెక్కసరిపోయింది.

ఆ కంఠంలో అధికారం లేదు. మార్దవం ఉంది.

''మీ అందరికీ ఈ కొత్త బంగారులోకం గురించి అనేక సందేహాలు ఉండి ఉంటాయి. వీళ్ళెవరు, ఎంత మంది ఉన్నారు, మనం ఎక్కడకు వెళుతున్నాము, మన బాధ్యతలేమిటి ఇలా అనేక ప్రశ్నలు. అన్నిటి సమాధానాలు దొరుకుతాయి''


మరొక ఋషితో చేతిలో కాగితాలు చూపుతూ...

''మిత్రులారా. ఇపుడు మీ అందరికీ ఒక ప్రశ్నాపత్రం ఇస్తున్నాము. అందులో ఏడు ప్రశ్నలు ఉంటాయి. వాటికి సమాధానాలు రాసి ఇవ్వండి''

వ్యక్తిగత వివరాలు రాయాలి కాబోలు అనుకున్నాను. ప్రశ్నలు ఆంగ్లంలో ఉన్నాయి. ప్రశ్నపత్రం పైన భారతీయ భాషల పేర్లు ఉన్నాయి.

''మీరు ఏ భాషలో మీ భావాల్ని వ్యక్తీకరించగలరో ఆ భాషపేరు మీద వేలితో స్పృశించండి''

తెలుగు అనే మాట మీద వేలు పెట్టాను.




అద్భుతం! ప్రశ్నలన్నీ తెలుగులోకి మారిపోయాయి. కాగితంలోనే కంప్యూటర్ చిప్ ఏదైనా పెట్టారా అని ఆశ్చర్యపోయాను. ఇంత సాంకేతిక అభివృద్ధి సాధించారంటే వేరే గ్రహం మీద కాలు మోపే ఉంటారు. మేము అక్కడి జీవరాశితో సహజీవనం చెయ్యాలనుకుంటాను. కానీ కనుచూపు మేరలో అంతరిక్ష నౌకలు కానీ, వింత ఆకారాలు కానీ లేవు. సాంకేతిక అభివృద్ధి వల్ల ప్రపంచం కుగ్రామం అయిపోతోందనుకుంటున్నా మనుషుల మధ్య దూరాలూ, అంతరాలూ పెరిగిపోతున్నాయి. కొడుకు సైబర్ వలలో పడి నాతో మాట్లాడటం కూడా మానేశాడు అని మొత్తుకుంటోంది నా శ్రీమతి. కొత్త బంగారులోకంలో సాంకేతిక అభివృద్ధితో సామాజిక విప్లవం జత కూడిందా? ప్రశ్నల మీద దృష్టి సారించాను.

ఒకటి – మీరు టీ.వీ. చూస్తున్నారు. ఒక ఛానెల్‌లో పల్లెల్లో వైద్యం, విద్య అవసరాల గురించి, అవకాశాల గురించి చర్చ జరుగుతోంది. మరొక ఛానెల్‌లో మీకిష్టమైన 'కౌన్ బనేగా కరోడ్ పతి' లాంటి కార్యక్రమం వస్తోంది. మీరు ఏ కార్యక్రమం చూస్తారు?

ప్రసార సాధనాలు దేశాన్ని ఎటు వైపు నడిపిస్తున్నాయో ఒక్క ప్రశ్నలో తెలిసిపోతోంది.

రెండు – మీ పిల్లల్ని ఎలాంటి బడిలో చేర్చాలనుకుంటున్నారు?

ఇది మన విద్యా విధానానికే సవాల్ విసిరే ప్రశ్న. ఎలాంటి బడి ఏముంది. ఇంగ్లీష్ టకటక మాట్లాడాలి. పదో తరగతిలో 540 మార్కులు దాటాలి. కనీసం 500 మార్కులు దాటితే ఏదో సాధించామని భావించే తల్లిదండ్రులు.

మా తమ్ముడి కూతురు నిమ్మీ గుర్తుకువచ్చింది. ఆరో తరగతి చదువుతోంది. ఒకరోజు తను ఏడుస్తూ కూర్చుంటే, ''ఏమైందీ తల్లీ'' అని అడిగాను. మోరల్ సైన్సు సబ్జెక్టులో90 మార్కులే వచ్చాయని, సరాసరి మార్కులు తగ్గాయని వాళ్ళమ్మ తిట్టిందంట. నిమ్మీ చదివే బడికి వెళ్ళి ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడాను. మోరల్ సైన్సు అనేది పిల్లలకు నీతి నియమాలు బోధించడానికి ఉద్దేశించిన సబ్జెక్ట్ అనీ, ఆ ఉద్దేశం నెరవేరడం ముఖ్యం కానీ వ్రాత పరీక్ష పెట్టనవసరంలేదనీ చెప్పి ఒప్పించాను.

మూడు – ఇక్కడకు వచ్చాక ఎంతమంది ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు? కనీసం నవ్వుతూ పలకరించుకున్నారా? మీరు మీ పొరుగువారువారిని ప్రేమిస్తున్నారా? నిజమే. చిరునవ్వుకి ఎంత శక్తి ఉంటుంది. శత్రువు హృదయాన్ని గెలుచుకోగల శక్తి చిరునవ్వుది. కీప్ టు లెఫ్ట్ అనే చిన్న నియమంతోన్ని రహదారి ప్రమాదాలను నివారిస్తున్నామో. పొరుగువాడిని ప్రేమించడం అనే చిన్న సూత్రాన్ని పాటించి జీవితాల్ని సుఖమయం చేసుకోలేమా?

నాలుగు – మీ జీవితంలో లంచం ఇవ్వాల్సిన సందర్భం ఎదురైందా? మీరు ఏం చేశారు?

నా స్నేహితుడు ప్రసాదరావు గుర్తుకువచ్చాడు.

తనొక ఇల్లు కొన్నాడు. రిజిస్ట్రేషన్ అధికారులతో స్పష్టంగా చెప్పాడు. మీరు ఎన్ని సార్లు తిప్పితే అన్నిసార్లు తిరుగుతాను. రూపాయి కూడా అంచం ఇచ్చే ప్రసక్తే లేదని. పని ఏ ఆటంకం లేకుండా జరిగిపోయింది. మనం చేసే నిజాయితీతో కూడు కున్నదైతే మనోస్థైర్యం దానంతట అదే వస్తుంది.

ఐదు – ఒక సంస్థ, సంఘం ఏర్పాటైంది. మీరు నాయకత్వం వహించాలని కోరుకుంటారా?

వివేకానందుడి సూక్తి గుర్తుకు వచ్చింది.

''నాయకత్వం వహించాలని ప్రయత్నించకు. నాయకత్వం వహించాలనే కోరిక జీవితం అనే సముద్రంలో అనేక గొప్ప ఓడల్ని ముంచేసింది''

ఆరు – కులం అనే అత్యంత పనికిమాలిన పదానికి మీరు దూరంగా ఉండగలిగారా?

ఊపిరిపీల్చడం మరిచిపోవచ్చు గానీ ఇది సాధ్యమా?

ఏడు – మీరు మార్పు కోసం ప్రయత్నించారా? కనీసం మీలో మార్పుకోసం.

ఈ ఏడు ప్రశ్నలూ చాలా మార్పు మౌలికమైనవి. ప్రతీ మనిషి తనకు తాను వేసుకోవలసినవి. నన్ను నేను మోసం చేసుకునే అలవాటు లేదు కనుక సమాధానాలు నిజాయితీగానే రాశాను. సమాధాన పత్రాలన్నిటినీ ఒక్కొక్కటిగా ఏదో పరికరంతో పై నుంచి కింద వరకు స్కాన్ చేశారు. మార్కులు వేసే పద్ధతో లేక డిటెక్టర్ లాంటి పరికరమో. ఈ పరీక్షలో తప్పితే కొత్త బంగారులోకంలోకి ప్రవేశం ఉండదని అర్థమైంది.

''మిమ్మల్ని ఇంత దూరం తీసుకొచ్చి ఈ విధంగా పరీక్షించినందుకు క్షమించడి. కానీ మాకు వేరే దారి లేదు. ఈ పద్ధతి మిమ్మల్ని అవమాన పరచాడానికో, మీ కన్నా మేము ఉన్నతులమని చెప్పడానికో కాదు''

పరీక్షా ఫలితాలు తెలుసుకునేటప్పటి ఉద్విగ్నత. ఒక్కో పేరు చదువుతున్నపుడు మిగిలిన వాళ్ళు చప్పట్లు చరిచి అభినందనలు తెలిపారు. తమ పేరు వస్తుందో రాదోనని ఉత్కంఠ. రాగానే బరువు తీరిన భావన.

ఇరవై నాలుగు పేర్లు చదివారు. నా పేరూ ఉంది. మిగిలిన పద్దెనిమిదిమందిలో నిరాశా నిస్పృహలు.

''అయ్యా మమ్మల్ని కొత్త బంగారు లోకంలోకి తీసుకు వెళ్ళండి. మేమీ పాడు లోకంలో ఉండలేం'' అని బతిమిలాడారు.

''నిజమే. నేను అన్ని సమాధానాలు నిజాయితీతో రాయని మాట నిజమే. అయితే నా మనసు స్వచ్ఛమైనది. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. నన్ను మళ్ళీ పాడులోకంలోకి తోసేస్తారా. నాకెంత ఆశ కల్పించారు. ఇంత పెద్ద శిక్ష విధించి అన్యాయం చేస్తారా?'' అని ఒకరు భోరున ఏడ్చారు.

''మీకు మరో అవకాశం వస్తుంద''ని ఓదార్చారు సప్త ఋషులు. పద్దెనిమిది మందినీ ఒక వాహనంలో పంపేశారు. పరీక్ష తప్పిన మిత్రుల పట్ల కలిగే సానుభూతి వాళ్ళపై కలిగింది.

## రచయిత పరిచయం



**స్వస్థలం:** నర్సరావు పేట, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, విశాఖపట్నంలో సీనియర్ మేనేజర్ ఉద్యోగం. ఇప్పటివరకూ 16 కథలు, నాలుగు బహుమతులు. 'కదంబం' శీర్షిక. ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వడం మినహా కార్యోన్ముఖుడ్ని కాలేకపోవడం నా అశక్తత. మంచి సాహిత్యం సమాజసేవలో భాగమని నమ్ముతాను. సి.పి.బ్రౌన్ అకాడమీ- నవ్య వీక్లీ కథల పోటీలో నా కథను బహుమతికి ఎంపికచేసినందుకు ధన్యవాదాలు.

-అనిసెట్టి శ్రీధర్

''ఇంక ఏ పరీక్షలూ లేకుండా మమ్మల్ని కొత్త బంగారులోకంలోకి తీసుకువెళ్ళేలా చూడు స్వామీ'' అని భగవంతుడు నా మొర ఆలకించి నట్టున్నాడు.

''మిత్రులారా! ఇపుడు రెండు నిమిషాలు అందరూ కళ్ళు మూసుకోండి. మనం కొత్త బంగారులోకంలోకి ప్రయాణించబోతున్నాం'' అన్నారొక ఋషి.

అందరం కళ్ళు మూసుకున్నాం. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు భావన, ఏం జరగబోతోందనే ఉత్కంఠని అధిగమించింది. మేం కూర్చున్నంత మేర పచ్చిక వృత్తాకారంలో ఉంది. అంతవరకూ భూమితో సహా పైకి లేచి వెళ్ళిపోతుందేమో.

''ఇప్పుడు నెమ్మదిగా కళ్ళు తెరవండి''

కంటి ఆపరేషన్ చేయించుకుని కట్టు విప్పాక తెరిచినట్టు కళ్ళు నెమ్మదిగా తెరిచాను.

ఏముంది?

ఇట్స్‌గాన్. పోయే పోచ్చి.

* * *

''అందమైన కల కన్నావన్న మాట'' అన్నాడు నా ప్రియమిత్రుడు శంకరం. నిట్టూర్చాను. కల కొనసాగి వాళ్ళు ఎక్కడకు తీసుకువెళ్ళేవాళ్ళో, ఏం చేస్తారో అనే కుతూహలం, ఆత్రుత ఎక్కువగా ఉంది.

''అయ్యో ఇది నిజమా కాదా అని దిగులుపడకు. ఇలాంటి కల కనడం కూడా అదృష్టమే. అయినా కొత్త బంగారులోకాన్ని ఎవరో, ఎక్కడనుండో వచ్చి సృష్టించరు. అది ఎక్కడో దూరంగానో, అడవుల్లోనో, వేరే గ్రహం మీదనో ఉండదు. మనమే సృష్టించుకోవాలి. మన మధ్యనే ఉంటుంది. మనం గుర్తుపట్టగలగాలి.

మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి ఊపునిచ్చిన దూబగుంట రోషమ్మ, ఢిల్లీలోని ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో ఉద్యోగాలు వదిలేసి చత్తీస్‌ఘడ్‌లోని మారుమూల పల్లెల్లో వైద్యం అందిస్తున్న వైద్యులు, హేమల్కస్ అడవుల్లో గోండులకు33 సంవత్సరాలుగా సేవ చేస్తున్న డాక్టర్ ప్రకాష్ ఆమ్టే దంపతులూ, మన రాష్ట్రంలో ఇ-సాగు కృష్ణారెడ్డి ఇలా ఎంతమందో కొత్త బంగారులోకాన్ని సృష్టించడానికే ప్రయత్నిస్తున్నారు.

మనబోటి ఆలోచనలు ఉన్నవాళ్ళంతా ఒక చోట కలిస్తే అదే కొత్త బంగారులోకం. ఆ ఏడు మౌలిక ప్రశ్నల్లో ఆఖరి ప్రశ్న ఉంది చూశావూ. మార్పు కోసం ఎప్పుడైనా ప్రయత్నించారా అని. అదీ మన తక్షణ కర్తవ్యం''

★

